క్లుప్తంగా

శివరాత్రి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబు



వడయార్‌పేటలో శివరాత్రికి సిద్ధమైన వనమల్లికార్జున స్వామి ఆలయం

మొగల్తూరు: శివరాత్రి ఉత్సవాలకు మండలంలోని శివాలయాలు సిద్ధమవుతున్నాయి. మొగల్తూరులోని పురాతన పార్వతీ పరమేశ్వరుని ఆలయం, వడయార్‌పేటలోని వనమల్లికార్జున స్వామి ఆలయం, కాళీపట్నంలోని కాళికేశ్వరాలయం, పేరుపాలెంలోని చంద్రమౌళీశ్వర స్వామి ఆలయం, ముత్యాలపల్లిలోని భువనేశ్వరీ సమేత ముక్తేశ్వర స్వామి ఆలయం, కొత్తపాలెంలోని శివాలయాలు ముస్తాబవుతున్నాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రతీ ఆలయంలోను క్యూలైన్లు ఏర్పాటు పూర్తి చేశారు. విద్యుత్ దీపాలంకరణలు, చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు.

వైభవంగా ముత్యాలమ్మ ఘటాల ఊరేగింపు




ముత్యాలమ్మ ఘటాలను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు

మొగల్తూరు: స్థానిక కుక్కలవారితోటలో ఉన్న చెట్టుకింద ముత్యాలమ్మ అమ్మవారి జాతరకు బుధవారం ఏర్పాట్లు ప్రారంభించారు. ప్రతీ ఏటా ఉగాదికి అమ్మవారి జాతరను నిర్వహించడం ఆనవాయితీ. దీనిలో భాగంగానే అమ్మవారి ఘటాలను ఊరేగింపుగా నడివీధి ముత్యాలమ్మ అమ్మవారిని నిలబెట్టే స్థలానికి తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి తిరిగి ఘటాలను చెట్టు కింద ముత్యాలమ్మ ఆలయానికి తీసుకునివచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్న సమారాధనకు భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.

డ్రెయిన్స్‌పై ఆక్రమణలను అడ్డుకోవాలి

యలమంచిలి: జిల్లాలోని మేజర్, మైనర్ డ్రయిన్స్ ఆక్రమణలకు గురికావడంతో రైతులు పెద్ద ఎత్తున నష్టపోతున్నారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని దొడ్డిపట్ల గ్రామంలో బుధవారం జరిగిన బీజేపీ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలంలోను, వరదల సమయంలోను డ్రెయిన్స్‌లోనికి గోదావరి నీరు వెనక్కి వచ్చి వరి చేలన్నీ మునకకు గురవుతున్నాయన్నారు. ఆ విధంగా మునకకు గురికాకుండా డ్రెయిన్స్ చివరి ప్రాంతంలో బాడవ సూరు భూములు ఉండేవన్నారు. ఆక్రమణలకు గురైన డ్రెయిన్స్ వెంబడి ఉన్న బాడవ సూరు భూములను ఖాళీ చేయించి రైతులకు మేలు చేయాలని ఆయన కోరారు. ఈ మేరకు పార్టీ సమావేశంలో తీర్మానం చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు దొంగ నరసింహకుమార్, నామన శ్రీనివాస్, వల్లభు దుర్గాప్రసాద్, కుక్కల కేశవరావు, తోలేటి చంటి, జడ్డు రామకృష్ణ, గుంటూరు కృష్ణంరాజు, జడ్డు వెంకటేశ్వరరావు, కొంబత్తుల శివకృష్ణ, బర్రె రామదాసు తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.మల్లేశ్వరి

పాలకొల్లు అర్బన్: కిశోర బాలికలు వివాహ వయస్సు 18 ఏళ్లు నిండకుండా వివాహం చేసుకోరాదని, తల్లిదండ్రులు బలవంతంగా వివాహం జరిపిస్తే శిక్షార్హులవుతారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.మల్లేశ్వరి అన్నారు. పాలకొల్లు మండలం లంకలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం కిశోర బాలికల అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. కిశోర బాలికలు వివాహ వయస్సు నిండకుండా వివాహం జరిపిస్తే మాతృ, శిశు మరణాలు ఎక్కువగా జరుగుతాయని హెచ్చరించారు. అలాగే రక్తహీనత కూడా కారణం అవుతుందన్నారు. ర్పంచ్ చొప్పల రజని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సత్యవేణి, మంగ, అంగన్‌వాడీ టీచర్‌లు గోగులమండ ఝాన్సీరాణి, విజయకుమారి, పార్వతి, సౌజన్య, సత్తార్ బీబీ, రాధ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై కేసు నమోదు

సాక్షి, భీమవరం: పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతున్న విద్యార్థినిపై యువకుడు అసభ్యకరంగా ప్రవర్తించడంపై ఫిర్యాదు అందిందని ఎస్సై పి.అప్పారావు బుధవారం తెలిపారు. మంగళవారం విద్యార్థిని వెంటపడిన యువకుడు ఆమె చేయి పట్టుకుని అల్లరి చేశాడని, ఫిర్యాదులో పేర్కొన్నట్టు ఎస్సై తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

నేటి నుంచి ఆచంటేశ్వరుని కల్యాణోత్సవాలు

• తిరునాళ్లకు ఏర్పాట్లు పూర్తి • ముస్తాబైన ఆచంటేశ్వరాలయం



విద్యుద్దీపాలంకరణలో ఆచంటేశ్వరాలయం



వస్త్రాలంకరణలో చలువ పందిళ్లు



విశేష అలంకరణలో శ్రీ ఆచంటేశ్వరస్వామి

పెనుగొండ: ఆచంటలోని శ్రీ ఆచంటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాలు గురువారం నుంచి 20 వరకూ ఐదు రోజుల పాటు వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు జిల్లాలలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు. ఉత్సవాల సందర్బంగా స్వామి వారి దర్శనంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బారికేట్లు ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణం చుట్టూ చలువ పందిళ్లు ఏర్పాటు చేసి, ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్థానిక కచేరి సెంటరు నుంచి శ్రీస్వామి వారి సత్రం వరకూ ఆచంట–కోడేరు ఆర్ అండ్‌బీ రహదారిని ఆనుకుని రంగురంగుల విద్యుత్‌దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఇప్పటికే ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ చైర్మన్ నెక్కంటి రామలింగేశ్వరరావు, కమిటీ సభ్యులు ఆలయ ఈఓ రామచంద్రకుమార్‌లు వివిధ శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి తిరునాళ్లలో స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఎ.వేమవరం పీహెచ్‌సీ, ఆచంట సీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందితో పాటు, మందులు అందుబాటులో ఉంచారు. ఉత్సవాల నేపథ్యంలో ట్రాఫిక్‌ను సాయిబాబా గుడి వద్ద నుంచి జూనియర్ కళాశాల మీదుగా తరలించారు. పెనుగొండ సీఐ జీవీవీ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మహా శివరాత్రి పర్వదినాన మార్టేరు నుంచి ప్రత్యేక బస్సులు నడపడానికి ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఆచంట సర్పంచ్ కోట సరోజని, పంచాయతీ కార్యదర్శి నాగబాబు తదితరులు పారిశుద్ధ్య పనులు పర్యవేక్షిస్తున్నారు.

ఐదు రోజుల పాటు అన్నదానం..

ఉత్సవాలు జరిగే ఐదు రోజులు శ్రీ స్వామి వారి సత్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించానికి ఏర్పాట్లు చేశారు. అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో ఏళ్ల తరబడి అన్ని రోజులు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం విశేషం. గ్రామ పెద్దలు కమిటీగా ఏర్పడి ఏటా కార్యక్రమం వేలాది మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు విరాళాలు పంపించడం ఆనవాయితీ.

శివరాత్రి పర్వదినాన రథోత్సవం

ఐదు రోజుల పాటు జరగనున్న కల్యాణోత్సవాల సందర్భంగా శ్రీస్వామివారి కళావేదికపై వివిధ సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రతి రోజు శ్రీస్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పార్వతి అమ్మవారికి కుంకుమ పూజలు జరగనున్నాయి. 16 తెల్లవారుజామున 4 గంటలకు శ్రీస్వామికి కల్యాణ మహోత్సవం, 16, 17 రాత్రి శ్రీస్వామి వారి గ్రామోత్సవం, 18న రథోత్సవం, 19 రాత్రి 8 గంటలకు జబర్‌దస్త్ టీమ్ ఆధ్వర్యంలో వినోద కార్యక్రమం, 20 స్వామి వారి పుష్పోత్సవ కార్యక్రమాలు జరగనున్నాయి.

తాళ్లచెరువులో 40 ఏళ్ల సమస్యకు మోక్షం



తాళ్లచెరువులో భట్లమగుటూరు కెనాల్ గట్టుకు రోడ్డును నిర్మించిన దృశ్యం

పెనుమంట్ర: మండలంలోని వెలగలవారిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని తాళ్లచెరువు గ్రామంలో 40 ఏళ్లనాటి సమస్య పరిష్కారమైంది. టీవల గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామానికి వచ్చిన స్థానిక ఎమ్మెల్యే మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు దృష్టికి ఆ సమస్యను తీసుకువెళ్లడంతో స్పందించిన ఆయన రూ. 10 లక్షలు జీజీఎం నిధులు మంజూరు చేయడంతో ఆసమస్యకు పరిష్కారం ఏర్పడింది. 40 ఏళ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం ఆగ్రామంలో ఇళ్ల స్థలాలు మంజూరు చేసింది. అనంతరం ఆ కాలనీలో ఇండ్లు నిర్మించుకున్నప్పటికీ భట్లమగుటూరు కెనాల్ గట్టున ఉన్న రోడ్డును తదుపరి వచ్చిన ఏ ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో ఆగట్టంతా చెత్తమొక్కలు మొలచి, నడవడానికి వీలులేకుండా ఉండేది. దాంతో గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే దృష్టికి సమస్యను తీసుకురావడంతో ఈ సమస్యకు పరిష్కారం ఏర్పడింది. దాంతో తక్షణమే పనులు ప్రారంభించిన అధికారులు గట్టున ఉన్న ఆక్రమణలు తొలగించి, రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఇప్పటికే గ్రావెల్ రోడ్డును నిర్మించిన అధికారులు కొద్దిరోజుల్లో సీసీ రోడ్డు నిర్మించడానికి ఏర్పాట్లు చేశారు. దాంతో ఈరోడ్డు సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారం ఏర్పడనుంది.

సంక్షేమమే సీఎం జగన్‌కు శ్రీరామరక్ష



పెనుగొండలో ప్రభుత్వ పథకాల బ్రోచర్‌ను వృద్ధుడికి అందిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: మూడేళ్ల కాలంలో రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమమే శ్రీరామరక్షగా నిలుస్తుందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. బుధవారం పెనుగొండలోని జిలం చెరువు, చెరుకువాడలో గడపగడప్పజీ మన ప్రభుత్వంలో పేదలకు అందించిన సంక్షేమాన్ని లబ్ధిదారులకు వివరించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. రాష్ట్రంలో అందిస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. సీఎం జగన్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ఇతర సీఎంలు అనురిస్తున్నారన్నారు. సంక్షేమానికి, అభివృద్ధికి లక్షల కోట్లు వ్యయం చేశారన్నారు. దీంతో ఉనికిని కోల్పోతామన్న భయంతో ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. నిన్న మొన్నటి వరకూ సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విమర్శించిన చంద్రబాబు నేడు మాట మార్చి సీఎం జగన్ సంక్షేమ పథకాలను తప్పని సరిగా అమలు చేస్తానని సీఎం జగన్ బాటలోకి వచ్చారన్నారు. సీఎం జగన్ ఇచ్చిన మాటకు ఎన్ని అడ్డంకులు వచ్చినా అమలు చేస్తూ ముందుకుసాగుతున్నారన్నారు. మరింత సంక్షేమం కోసం సీఎం జగన్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), వైస్ ఎంపీపీ పాలపర్తి సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ సభ్యులు నూలి భాను తాడి సుబ్బిరెడ్డి, చిన్నం ఏడుకొండలు, దేవ సర్పంచ్ నల్లూరి సత్యనారాయణ, మాజీ ఉప సర్పంచ్ నూలి ధీరజ్, మండల కన్వీనరు నల్లిమిల్లి బాబిరెడ్డి, సేవాదళ్ మండల కన్వీనరు బాలం సత్తిరాజు, పంచాయతీ సభ్యులు పిల్లి చాముండేశ్వరరావు, పూతినీడు శ్రీను, బళ్ల విజయలక్ష్మీ, వెలగల శ్రీనివాసరెడ్డి, ఆదిరెడ్డి సన్యాసిరావు,పార్టీ నాయకులు పాలసత్తి రాజా, దంపనబోయిన బాబూరావు, గాజుల బులిపుల్లారావు, సుంకర నాగబాబు, ఆకిశెట్టి చంటి, నాగిశెట్టి నరశింహరావు,మేడ పాటి వీర్రెడ్డి,తిక్కిరెడ్డి పవన్ కుమార్, మెరిపే నాని, కౌరు అశోక్, నేలపూడి లక్ష్మణరావు, కుసుమే నాగేశ్వరరావు, పలివెల శ్రీను, వేంద్ర లీలా వెంకట రమణ పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి పాఠశాలలోనే భోజనం చేయాలి



జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ కె.కృష్ణారావు

పాలకొల్లు అర్బన్: ప్రతీ విద్యార్థి పాఠశాలలోనే భోజనం చేసే విధంగా ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేయాలని మధ్యాహ్న భోజనం జిల్లా కోఆర్డినేటర్ కె కృష్ణారావు కోరారు. పాలకొల్లు మండలం శివదేవుని చిక్కాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అలాగే దగ్గులూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజన పథకాన్ని కృష్ణారావు ఆకస్మిక తనిఖీ చేశారు. నూటికి నూరుశాతం విద్యార్థులు భోజనం చేయాలని, ఆ విధంగా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. ప్రతీ రోజు మెనూ ప్రకారం వంట చేయాలన్నారు. అలాగే రుచికరంగా భోజనం తయారు చేయాలని నిర్వాహకులను కోరారు. మెనూ ప్రకారం విజిటబుల్ పలావు, బంగాళా దుంప కుర్మా కూర, కోడిగుడ్లు, చిక్కీలు అందజేశారన్నారు. పరిశీలించిన రెండు పాఠశాలల్లో నూరు శాతం మధ్యాహ్నం భోజనం చేయడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. శివదేవునిచిక్కాల హైస్కూల్ విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. మధ్యాహ్న భోజనం రికార్డులు పరిశీలించారు. అలాగే మరుగుదొడ్లు, మూత్రశాలలు పరిశీలించి ఆయాకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బి.వెంకటేశ్వర్లు, ఎస్.మహాలక్ష్మి, సీఆర్‌పీ బి.రామకృష్ణ పాల్గొన్నారు.

సర్వే పారదర్శకంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఆనంద్ కుమార్

మొగల్తూరు: సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలపై చేపట్టిన సర్వే పారదర్శకంగా ఉండాలని ఎంపీడీఓ ఆర్సీ ఆనంద కుమార్ సూచించారు. ఎస్‌డీజీ (సస్టేయిన్ బుల్ డెవలప్‌మెంట్ గోల్) సుస్థిర, అభివృద్ధి లక్ష్యాలు అనే అంశంపై బుదవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉన్నతాధికారులు ఎనిమిది అంశాలపై సర్వే చేయించాలని సూచించారని కార్యదర్శులు, వలంటీర్లు, సంక్షేమ శాఖ సహాయకులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్ఎమ్, ఆశ వర్కర్లు, సర్వేలో పాల్గొనాలన్నారు. రక్తహీనత కలిగి ఉన్న 19 సంవత్సారాల వయస్సు ఉన్న కౌమార దశలో ఉన్న స్త్రీల వివరాలు, రక్తహీనత కలిగి ఉన్న గర్భిణుల వివరాలు, 5 సంవత్సరాల లోపు ఉన్న కుంగిపోయిన పిల్లల వివరాలు, ప్రాథమిక విద్యలో 1నుండి 8వ తరగతి వరకూ ఉన్న విద్యార్థుల వివరాలు, ఉన్నత విద్యలో ఇంటర్ విద్యార్థుల వివరాలు, మౌలిక సదుపాయాలు కలిగి ఉన్న ప్రాథమిక పాఠశాలల వివరాలు, పాఠశాలలో పని చేస్తున్న టాయిలెట్‌ల వివరాలు తదితర విషయాలపై ప్రతీ ఇంటికి వెళ్లి సర్వే చేసి ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ నవీన కిరణ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



రోడ్డు పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

నరసాపురం: పట్టణంలో వివిధ వార్డుల్లో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరిత గతిన సకాలంలో పూర్తి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ సూచించారు. బుధవారం పట్టణంలోని 8, 9 వార్డుల్లో 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.48 లక్షలతో జరుగుతున్న సీసీ రోడ్ల పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రభుత్వం ఒకవైపు పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూనే అభివృద్ధికి కూడా పెద్దపీట వేస్తుందని చెప్పారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో పెద్ద ఎత్తున నిధులు వెచ్చించి రోడ్లు, డ్రెయినేజీలు అభివృద్ధి చేస్తున్నామన్నారు. జరుగుతున్న అభివృద్ధి పనులు నాణ్యతతో జరిగేలా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. అభివృద్ధి పనులు వినియోగంలోకి వస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కస్తూరి ఇందిరాదేవి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

శీతల శవపేటిక అందజేత



గ్రామానికి శీతల శవపేటిక అందజేస్తున్న కొడవటి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు

యలమంచిలి: మేడపాడు గ్రామానికి చెందిన కొడవటి నాగేశ్వరరావు జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు కొడవటి కమల, కొడవటి భాస్కరరావు, కొడవటి లక్ష్మీనారాయణలు బుధవారం రూ.లక్ష విలువ చేసే శీతల శవపేటికను గ్రామానికి అందించారు. ప్రభుత్వ నిధులు, దాతల సహకారంతో ఇటీవలె గ్రామంలోని శ్మశానవాటికను గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు దేగల సూర్యప్రభ, దేగల వెంకటేశ్వరరావు దంపతులు అభివృద్ధి చేశారు. ఇప్పటికే మేడపాడులో విష్ణు దంత వైద్యశాల వారు అందించిన ఒక శీతల శవపేటిక ఉంది. అయితే శీతల శవపేటికకు డిమాండ్ పెరగడంతో నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు మరొకటి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గుర్రాల వెంకట్రావు, గంధం సత్యకీర్తి, కుక్కల సూరయ్య, వర్ధనపు వెంకటేశ్వరరావు, అడబాల రామ్మోహనరావు, బాలం అంజిబాబు, గంధం రాజా, గాది వరదయ్య తదితరులు పాల్గొన్నారు.

డీఎన్నార్ కళాశాలలో ఓపెన్ డే



ఓపెన్ డే కార్యక్రమంలో భాగంగా డిఎన్నార్ కళాశాల విద్యార్థులు ర్యాలీ

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంచి నాణ్యమైన విద్య అందుతుందని దాసరి నారాయణ రావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి తెలిపారు. బుధవారం స్థానిక డీఎన్నార్ కళాశాల నుంచి ఓపెన్ డే కార్యక్రమంలో బాగంగా పట్టణంలో ఉన్న జూనియర్ కళాశాలలకు తిరిగి అవగాహన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శోభారాణి మాట్లాడుతూ జిల్లాలోనే ఏకైక మహిళా డిగ్రీ కళాశాల డీఎన్నార్ కళాశాల ఒక్కటేనని అన్నారు. విద్యలో అత్యాధునికమైన పరికరాలు అలాగే శారీరక ధృడత్వానికి ఇండోర్ స్టేడియం వంటివి ఎన్నో సదుపాయాలు డీఎన్నార్ డిగ్రీ కళాశాలలో ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పట్టణంలో కోకోనట్ మర్చంట్స్ జూనియర్ కళాశాల, ఎఎస్ఎన్ఎం జూనియర్ కళాశాల, సబిత, మాంటిస్సోరి జూనియర్ కళాశాలలు, లంకలకోడేరు, యలమంచిలి జూనియర్ కళాశాలల్లో పర్యటించారు. ఈ నెల 17న విద్యార్థినులందరూ డీఎన్నార్ కళాశాలను సందర్శించాలని కోరారు.

నేడు కాళీపట్నంలో గృహ సారథులతో సమావేశం

మొగల్తూరు : మండలంలోని కాళీపట్నం తూర్పులో గురువారం గృహసారథులతో నిర్వహించే సమావేశానికి ముఖ్య అతిథిగా చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు హాజరుకానున్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కర్రి ఏసుబాబు తెలిపారు. కాళీపట్నం తూర్పు, పడమర, కొత్తోట, పాతపాడు, జగన్నాథపురం, కోమటితిప్ప గ్రామాలకు చెందిన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ హోదాలో ఉన్న నాయకులు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

• మొగల్తూరును కమ్మేసిన మంచు



మొగల్తూరులో ప్రధాన రహదారిని కమ్మేసిన మంచు

గత కొద్ది రోజులుగా పగలు వేసవిని తలపించేలా ఎండ, రాత్రి పూట మంచు కురుస్తుండటంతో విభిన్న వాతావరణ నెలకొంది. బుధవారం వేకువజాము నుంచి ఉదయం 10 గంటల వరకూ విపరీతమైన మంచు కురియడంతో రహదారులను పూర్తిగా కమ్మేసింది. అటు జాతీయ రహదారితో పాటు ఇటు గ్రామంలోని ప్రధాన రహదారులను మంచు కమ్మేయడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మరో వైపు విపరతీమైన మంచు కురియడంతో మామాడి పూత మాడిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

- మొగల్తూరు

ఆర్థిక నిర్వహణపై వర్క్‌షాప్



ఎంబీఏ విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం: పట్టణంలోని వైఎస్ కళాశాలలో ఎంబీఏ విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్ అనే సంస్థ ఆర్థిక నిర్వహణపై రెండు రోజుల అవగాహనా సదస్సు ఏర్పాటు చేసింది. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సును బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ ఏపీవీ అప్పారావు ప్రారంభించారు. మొదటి రోజు సదస్సులో సంస్థ ప్రతినిధులు ఆర్థిక క్రమశిక్షణ, ఆదాయ మార్గాలు ఎలా ఎంచుకోవాలి? ఏఏ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ప్రస్తుత డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ మోసాలకు గురికాకుండా ఆర్థిక క్రమశిక్షణ ఎలా పాటించాలనే విషయాలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంబీఏ హెడ్ ఆర్ పార్థసారథి, హెచ్‌ఆర్డీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.